



షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక






Best for Readers
THE POWER OF RK PEN



సంపుటి : 3 సంచిక : 70 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 13 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 70 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Friday 13 February 2026 PAGES : 8 PRICE : 3/-


# పర్యాటకానికి పారిశ్రామిక హోదా..



- అమరావతిలో క్రియేటివ్ సిటీ: సీఎం చంద్రబాబు
- అమరావతిలో క్రియేటివ్ సిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నిర్ణయం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్టు ప్రకటన
- అభివృద్ధికి అటవీ శాఖ సహకరించడం లేదని తీవ్ర అసంతృప్తి
- హిందూపురం వద్ద ఎలక్ట్రానిక్స్ సిటీ ఏర్పాటుకు యోచన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

జిల్లా కలెక్టర్ల రెండో రోజు సమావేశంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిపై కీలక దిశానిర్దేశం చేశారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాల కల్పనలో అడ్డంకులను తొలగించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. అభివృద్ధి ప్రణాళికలకు అటవీ శాఖ అధికారులు సహకరించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, వారి తీరు మారాలని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.



**పర్యాటకానికి పెద్దపీట..**
**అమరావతిలో క్రియేటివ్ సిటీ**

ఏపీలో పర్యాటక రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులను సిద్ధం చేయాలని, హోమ్ స్టేలను ప్రోత్సహించాలని ▶మిగతా 2లో

# టారిఫ్‌ల కోసం ట్రంప్ '301' ఆయుధం.. భారత్ సహా 16 దేశాలపై దర్యాప్తు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 12)

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీంతో ఇతర దేశాల నుంచి ఎలాగైనా టారిఫ్‌లు వసూలుచేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్ వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం.

**ఏంటీ సెక్షన్ 301**

ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ▶మిగతా 2లో

# ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది?: షర్మిల

**రంజాన్ తోఫా ఇవ్వకుండా ఇఫ్తార్ విందులు ఎందుకని ప్రభుత్వానికి ప్రశ్న**
**చంద్రబాబు మోదీకి, బీజేపీకి భయపడుతున్నారని ఆరోపణ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి ▶మిగతా 2లో

# గూగుల్ ఏఐ హబ్ మీద కోర్టుకెళ్లడం రాష్ట్రాభివృద్ధికి వ్యతిరేకం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

విశాఖలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఏఐ హబ్‌కు వ్యతిరేకంగా కోర్టుకెళ్లడం ద్వారా జగన్ మరోసారి తన అభివృద్ధి వ్యతిరేక రాజకీయాలకు తెరలేపారని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. విశాఖలో గూగుల్ సంస్థ పెట్టుబడులు దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అని పేర్కొన్నారు. యువత, రాష్ట్ర భవిష్యత్తు మీద మీకెందుకు విద్వేషం? అంటూ జగన్‌ను నిలదీశారు. వైకాపా వాళ్లు ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్రాభివృద్ధి ఆగదని బుధవారం ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. "మొదట అమరావతిని వ్యతిరేకించారు. ఆ తర్వాత 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం చేసుకొన్న విద్యుత్ ఒప్పందాల్ని రద్దు చేశారు. ఉద్యోగాలు సృష్టించే ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో వ్యాజ్యాలు వేశారు" అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

# ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది జగనే



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

వైకాపా ప్రభుత్వంలో అంకెల గారడీతో జగన్ చేసిన ఆర్థిక విధ్వంసానికి రాష్ట్రం బలైందని మంత్రులు మండిపడ్డారు. దాని పర్యవసా నాల్ని కూటమి ప్రభుత్వం భరిస్తోందన్నారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాల్ని నాలుగు గోడల మధ్య ప్రెస్‌మీట్లు పెట్టి చెప్పడమేంటని జగన్‌ను నిలదీశారు. ప్రజారోగ్యం మీద చిత్తశుద్ధి ఉంటే రూ.3 వేల కోట్ల బకాయిలు ఎందుకుపెట్టారని ప్రశ్నించారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.13,500 ఇస్తానని...రూ.ఆరు వేలు ఎగ్గొట్టిన చరిత్ర వైకాపా వాళ్లదని మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, సవిత, కొండపల్లి శ్రీనివాస్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు విరుచుకుపడ్డారు. "జగన్ రైతు వ్యతిరేక విధానాలతో నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న ▶మిగతా 2లో

# విద్యుత్ డిమాండ్‌ను అందుకునేందుకు ప్రభుత్వం సిద్ధం: మంత్రి గొట్టిపాటి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

ఏపీలో రికార్డుస్థాయి విద్యుదుత్పత్తిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ జెన్‌కో 6,101 మెగావాట్లతో జీవితకాల రికార్డు సృష్టించిందన్నారు. సీఎం సూచనలు, సలహాలతోనే ఈ రికార్డు సాధ్యమైందన్నారు. ఇంజినీర్లు, అధికారుల అంకితభావం, నైపుణ్యం, కృషితోనే ఈ రికార్డు నమోదైందని చెప్పారు. వేసవి విద్యుత్ డిమాండ్‌కు అధిక స్థాయిలో విద్యుదుత్పత్తిని కొనసాగించడం కీలకమన్నారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌ను అందుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గొట్టిపాటి చెప్పారు.



# అప్పుల లెక్కలపై కేంద్రానికి లేఖ రాస్తా

**రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే ఎమ్మెల్యేలకు ఆటలు, స్కిట్‌లా?**

**మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

అప్పులపై అసెంబ్లీలో తప్పుడు లెక్కలు చూపించారని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. '2024-25లో రూ.81,082 కోట్ల అప్పులు చేశారు. కానీ రూ.60,485 కోట్లు మాత్రమే చేసినట్లుగా తప్పుడు లెక్కలను చంద్రబాబు అసెంబ్లీలో చూపించారు. కాగ్ నివేదికలో ఇది బయటపడింది. దీనిపై మేం కేబినెట్ సెక్రటరీ, డీవోపీటీకి, ఫైనాన్స్ సెక్రటరీకి లేఖ రాస్తాం'అని తెలిపారు. బుధవారం జగన్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌పై గత నెల ప్రెస్‌మీట్‌లో తానడిగిన ప్రశ్నల్లో దేనికీ అసెంబ్లీలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానాలు చెప్పలేదని వ్యాఖ్యానించారు. '16రోజులపాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సొంత డబ్బాలు, తప్పుడు లెక్కలు తప్ప ప్రజలకు ఒరిగింది సున్నా. రెండేళ్ల నుంచి గిట్టుబాటు ధరల్లేక సంక్షోభంలో రైతులు కొట్టుమిట్టాడుతుంటే...ఎమ్మెల్యేలు ఆటలాడుతూ..స్కిట్లు వేసుకుంటూ కాలక్షేపం చేశారు' అని విమర్శించారు.




**ఆర్థిక విధ్వంసం :** చంద్రబాబు చేస్తున్న ఆర్థిక విధ్వంసాన్ని 'కాగ్' కళ్లకు కట్టినట్లు నివేదించిందని జగన్ వ్యాఖ్యానించారు. ▶మిగతా 2లో

# వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు: కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన ▶మిగతా 2లో




# నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు... గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం




**ఇరాన్ యుద్ధంతో తీవ్రమైన వంటగ్యాస్ కొరత**

**గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెరిగిన బుకింగ్ గ్యాప్**

**రెండు సిలిండర్ల మధ్య వ్యవధిని పెంచిన కేంద్ర ప్రభుత్వం**

# ఇరాన్‌తో యుద్ధం.. తొలి ఆరు రోజుల్లో రూ.లక్ష కోట్లు ఖర్చు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 12)

పశ్చిమాసియాలో పోరు కొనసాగుతోంది. గత 11 రోజులుగా ఇరాన్‌పై భీకర స్థాయిలో దాడులు చేసేందుకు అమెరికా అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు ఉపయోగిస్తోంది. ఇందుకుగాను అమెరికా తన చేతి చమురును వదిలించుకొంటున్నట్లు తెలుస్తోంది. యుద్ధం మొదలైన తొలి ఆరు రోజులకు గాను ట్రంప్ యంత్రాంగానికి 11 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.లక్ష కోట్లకు పైగా) ఖర్చయినట్లు సమాచారం. సెనేటర్లతో జరిగిన అంతర్గత సమావేశంలో రక్షణ అధికారులు ఈ ఖర్చుకు సంబంధించిన వివరాలను తెలిపినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ▶మిగతా 2లో



## బద్వేల్‌లో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 12)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి సిబ్బంది పాల కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా స్టీల్ క్యారీలను ఉపయోగించి పాలు తీసుకెళ్లాలని ప్రజలకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాల ప్రభావంతో పలువురు వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించడం మానేసి స్టీల్ క్యారీలతో పాలు తీసుకెళ్లడం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్టీల్ క్యారీలతో పాలు తీసుకెళ్తున్న వారిని ఆయన అభినందించారు.

## హైస్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 12)

బద్వేలు పట్టణంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షికోత్సవం మరియు పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు జి. వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, గేయాలు, నాటికలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందించి ప్రేక్షకులను అలరించారు. విద్యా, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పీఎంసీ చైర్మన్ పి. నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ జి. భారతి, కాలేజ్ ఇన్‌చార్జ్ ఈ. జకరయ్య, ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ ఎ. రామయ్యతో పాటు ఉపాధ్యాయులు ఎం. రామసుబ్బయ్య, ఎన్.వి. శేషారెడ్డి, ఆర్థర్, ఎస్. అనీషా బేగం, కె. శ్రీనివాసులు, సి. రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించి ఊరి ఒడిని కాపాడండి





(షణ్ముఖ వెలుగు, కొండపి, మార్చి 12)

టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి బాలకోటయ్య, ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ హై కలిసి సంయుక్తంగా యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించి ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో గ్రామంలో గురువారం పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులను, డ్రాప్ ఔట్స్ విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను వెళ్లి కలిసి తమ పాఠశాలలో విద్యార్థులకు చక్కటి భోజన వసతి సదుపాయం ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఉచితంగా, రెండు జతల యూనిఫాం షూ బెల్టు, ప్రతిరోజు గుడ్డు, రోజు మార్చి రోజు చిక్కి రాగిజావ మొదలగు పౌష్టికమైన ఆహార పదార్థాలను అందిస్తూ క్వాలిఫైడ్ ఉపాధ్యాయ చేత విద్యాబోధన జరుగుతుందన్నారు. డిజిటల్ క్లాసులో విద్యాబోధన, విద్యార్థులకు ఆడుకొనుటకు గ్రౌండ్, ఆట వస్తువుల పంపిణీ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కథల పుస్తకాలు, లాబ్స్, లైబ్రరీ మొదలగు సౌకర్యాలు ఉచితంగా ఏర్పాటు చేస్తుందని తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉరి బడిని కాపాడాలని అభ్యర్థించారు. చాలామంది తల్లిదండ్రులు స్పందించి విద్యార్థులు చేర్పిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

### మొదటి పేజీ తరువాయి

## పర్యాటకానికి పారిశ్రామిక హోదా..

లక్ష్యంగా నిర్దేశించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రకటించారు. పాపికొండలు, సూర్యలంకను మరో గోవాలా, గండికోటను భారత్‌కే గ్రాండ్ కాన్యన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. తిమ్మమ్మ మర్రిమాను, కంభం చెరువు వంటి చారిత్రక ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించి పర్యాటకులను ఆకర్షించాలని సూచించారు. కంటెంట్ క్రియేషన్‌ను ప్రోత్సహించేందుకు అమరావతిలో ఒక 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేస్తామని, ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్దపీట వేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

**అటవీ శాఖపై తీవ్ర అసంతృప్తి**

అభివృద్ధి పనులకు అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. "పోలీస్ డిపార్ట్‌మెంట్ పీపుల్ ఫ్రెండ్లీగా మారింది కానీ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ మారలేదు. నాలుగోసారి సీఎంగా చేస్తున్నా, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి అటవీ శాఖపై ఫిర్యాదులు వస్తున్నాయి" అని అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీశైలంలో భక్తులను అడ్డుకోవడం, బద్వేలులో ప్రాజెక్టులకు ఆటంకాలు కల్పించడం వంటి సంఘటనలను ప్రస్తావించారు. అటవీ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ల కిందే పనిచేయాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, నిబంధనలకు లోబడి పర్యావరణహిత ప్రాజెక్టులకు సహకరించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అడ్డుపడవద్దని స్పష్టం చేశారు.

**మౌలిక వసతులు, పరిశ్రమలే లక్ష్యం**

రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. హిందూపురం వద్ద ఎలక్ట్రానిక్స్ సిటీ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు. స్టార్టప్‌లు, యువతలోని వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను మరింత క్రియాశీలం చేయాలన్నారు. జిల్లాల్లో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, తలసరి ఆదాయం పెంపుపై కలెక్టర్లు దృష్టి సారించాలని, వారి పనితీరును సమీక్షిస్తామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటును సులభతరం చేసేందుకు, 5 ఎకరాల వరకు ఏపీఐఐసీ భూ కేటాయింపుల అధికారాన్ని కలెక్టర్లకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది?: షర్మిల

చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## టారిఫ్‌ల కోసం ట్రంప్ '301' ఆయుధం.. భారత్ సహా 16 దేశాలపై దర్యాప్తు

ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు (ఙతీఋఎవ ఞశీశ్రీఱ-షఱవం).. అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.

**భారత్‌ను ఎందుకు చేర్చారు..?**

చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## అప్పుల లెక్కలపై కేంద్రానికి లేఖ రాస్తా

'వైకాపా హయాం చివరి సంవత్సరమైన 2023-24తో.. చంద్రబాబు సీఎం అయ్యాక తొలి సంవత్సరం 2024-25ను పోలిస్తే.. రాష్ట్ర రెవెన్యూలోటు 56శాతం, ద్రవ్యలోటు అంటే అప్పులు 31శాతం పెరిగాయి. 2025-26 మొదటి 10 నెలల్లో ద్రవ్యలోటు 39.74శాతానికి ఎగబాకింది. రాబడులూ తగ్గాయి. ఎన్‌బీసీ(నెట్ బారోయింగ్ సీలింగ్)ని చంద్రబాబు ప్రతిసారీ ఉల్లంఘిస్తూనే మరోవైపు తానో గొప్ప పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్నారు'అని విమర్శించారు. 'మా హయాంలో రూ.75వేల విలువ చేసే డాలర్ల దొంగతనం జరిగితే, తితిదేకి మంచి చేస్తూ రూ.15కోట్ల విలువైన ఆస్తులను రాయించాం. చంద్రబాబు హయాంలో 2025 జనవరిలో పరకామణిలో రూ.కోటి విలువైన బంగారాన్ని దోచేసిన దొంగకు బెయిల్ ఇప్పించారు. ఆ కేసును కప్పిపుచ్చేందుకే 2023నాటి డాలర్ చోరీ కేసును బయటకు తీసి ప్రచారం చేశారు' అని అన్నారు. 'చంద్రబాబు ఉప ప్రధానా? ఎవరు చెప్పారు? నిజంగా ఇది గొప్ప సంగతే(వ్యంగ్యంగా).. ఈయనను ముఖ్యమంత్రిగానే ప్రజలు భరించలేకున్నారు. ఇక ఉప ప్రధాని అయితే దేశ ప్రజలేం భరిస్తారు'అని ఓ ప్రశ్నపై జగన్ వ్యాఖ్యానించారు.

## ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది జగనే

81 మంది అన్నదాతల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. వైకాపా ప్రభుత్వం పంట బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మూడు సీజన్లకు సంబంధించిన రూ.1,990 కోట్ల భారం ప్రస్తుత ప్రభుత్వంపై పడింది" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. "జగన్ జమానాలో శ్రీవారి పరకామణిలో రూ.75 వేల విలువైన డాలర్లు దొంగతనం చేసిన వ్యక్తి..రూ.15 కోట్లు తితిదేకు రాసిచ్చి పునీతుడయ్యారని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉంది. రూ.వేల కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారని సీబీఐ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన అదే రీతిలో భారీ చెల్లింపులు చేసి పునీతులవుతారా" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. "బీసీ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీల కింద చెల్లించాల్సిన రూ.110 కోట్లను జగన్ ఎగ్గొట్టారు. ఆయన విద్యుత్ ఛార్జీలు పెంచితే..ట్రూడౌన్‌తో వాటిని తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానిది"అని మంత్రి సవిత తెలిపారు. "వైకాపా ప్రభుత్వంలో 11 లక్షల పింఛన్లను అన్యాయంగా తొలగించి పేదల పొట్టగొట్టారు. మృతి చెందినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారివే కూటమి ప్రభుత్వంలో తొలగించాం. స్పౌస్ కోటాలో ప్రతి నెలా వితంతువులకు పింఛన్లు మంజూరు చేస్తున్నాం. జగన్ తన సొంత ఛానల్, అనుకూల మీడియాలో ఆరు లక్షల పింఛన్లు తొలగించారని....మరో 7.46 లక్షల పింఛన్లు తొలగించబోతున్నారంటూ అసత్యాలు ప్రచారం చేయిస్తున్నారు" అని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. "వైకాపా ప్రభుత్వంలో రోజుకు సగటున నలుగురు బాలికలపై అఘాయిత్యాలు జరిగాయి. తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలో ఓ అంధ బాలికపై అత్యాచారం జరిగినా జగన్ పట్టించుకోలేదు. 2 శాతం కేసుల్లోనే శిక్షలు పడటం ఆయన వైఫల్యం. అలాంటి వ్యక్తి మహిళల భద్రత గురించి మాట్లాడటం సిగ్గుచేటు" అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు.

## వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు: కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు.వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీజీహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

## నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు... గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 12)

దేశంలో నెలకొన్న వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని 45 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం 25 రోజుల నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేసింది.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు సిలిండర్ల బుకింగ్ మధ్య 25 రోజుల గ్యాప్ ఉండగా, ఇకపై ఈ నిబంధన కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు మాత్రం ఒక సిలిండర్ బుక్ చేశాక, తదుపరి సిలిండర్ బుకింగ్ కోసం 45 రోజులు ఆగాల్సి ఉంటుంది.ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. దీంతో చాలామంది వినియోగదారులు ముందుజాగ్రత్తగా సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ సహా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి డిమాండ్ పెరగడంతో కమర్షియల్ సిలిండర్లను ఏజెన్సీలు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.కాగా, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించి, అందరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. గ్యాస్ ఉత్పత్తిని పెంచినప్పటికీ, డిమాండ్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగానే ఈ కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

## ఇరాన్‌తో యుద్ధం.. తొలి ఆరు రోజుల్లో రూ.లక్ష కోట్లు ఖర్చు

ఆరు రోజులకు 11.3 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఖర్చయిందని అధికారులు అంచనా వేశారు. అయితే, ఇది ఇంకా చాలా పెద్ద మొత్తంలో ఉండొచ్చని సెనేటర్ క్రిస్ కూన్స్ విలేకరులతో అన్నారు. మరోవైపు యుద్ధాన్ని కొనసాగించడం కోసం ట్రంప్ యంత్రాంగం అదనపు నిధుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. అదనపు బడ్జెట్‌ను కోరుతూ వైట్‌హౌస్ త్వరలోనే కాంగ్రెస్‌కు ప్రతిపాదనలు పంపనుందని కొందరు కాంగ్రెస్ సహాయకులు పేర్కొన్నారు. దాదాపు 50 బిలియన్ డాలర్ల వరకు కోరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతనెల 28 నుంచి అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై భీకర దాడులు చేస్తున్నాయి. ఇరాన్ కూడా ప్రతీకార దాడులతో విరుచుకుపడుతోంది. యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే యూఎస్ 5.6 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ సామగ్రిని వినియోగించినట్లు అధికారులు అంచనా వేశారు. అమెరికా రక్షణశాఖ ఇప్పటికే ఇబ్బందుల్లో ఉండగా.. ప్రస్తుత యుద్ధం వల్ల సైనిక నిల్వలు మరింత తగ్గుతాయని కాంగ్రెస్ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు.


## మహిళా శానిటేషన్ వర్కర్స్‌కి మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంపు

### ప్రారంభించిన మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

మహిళా శానిటేషన్ వర్కర్స్ కి మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంపును గురువారం నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కే వెంకటేశ్వరరావులు లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా, స్వచ్ఛభారత్ మిషన్ 2.0 లో భాగంగా ఒంగోలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న మహిళా శానిటేషన్ వర్కర్లకు కూడా మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంప్ ను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంపును మేయర్ గంగాడ సుజాత, నగరపాలక సంస్థ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని శానిటేషన్ విభాగంలో సుమారు 500 మంది దాకా ఆడవాళ్లు పని చేస్తున్నారని వారి కోసం జిజిహెచ్ హాస్పిటల్ వారితో కలిసి వారందరికీ మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఏర్పాటు చేయడం ద్వారా వారికి క్యాన్సర్ మహమ్మారి గురించి అవగాహన కల్పించి వారందరికీ కూడా ఈ స్క్రీనింగ్ టెస్టులు చేపించడం జరుగుతుంది అని తెలిపారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మహిళలందరూ ఆరోగ్యంగా బాగుంటేనే వారి కుటుంబాలు, సమాజం ఆరోగ్యకరంగా ఉంటుంది అని తెలిపారు. నగరపాలక సంస్థలో ముఖ్యంగా శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న వారిలో ఎక్కువ శాతం మహిళలు ఉన్నారని, వారందరూ కూడా ఎటువంటి ఆరోగ్య సమస్య లేకుండా ఉంటేనే మనం ఒంగోలు నగరం స్వచ్ఛ ఒంగోలు నగరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా శానిటేషన్ వర్కర్స్ కోసం ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తున్న జిజిహెచ్ సిబ్బందికి మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ మాణిక్యాలరావు, జిజిహెచ్ డాక్టర్లు, సిబ్బంది, సానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ వర్కర్లు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

25.01.26 ఆదివారం


## 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో
# ఏపీ జెన్కో చారిత్రాత్మక రికార్డు

- సీఎం చంద్రబాబు సలహాలు, జెన్కో సిబ్బంది కృషితోనే రికార్డు ఉత్పత్తి
- గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నిరంతరాయ విద్యుత్తే లక్ష్యం
- వేసవి విద్యుత్ అవసరాలు తీర్చేందుకు సిద్ధంగా ఉండాలి
- జెన్కో రికార్డు సాధనకు కృషి చేసిన అందరికీ అభినందనలు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మార్చి 12)



రాష్ట్ర విద్యుత్ చరిత్రలో మొదటి సారి ఏపీ జెన్కో 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో లైఫ్ టైం రికార్డు సాధించడం గొప్ప విషయమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో)ను స్థాపించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ నమోదు కాని విధంగా 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 5730 మెగావాట్ల ఎక్స్-బస్ ఉత్పత్తి సాధించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో ఇచ్చిన సలహాలు, సూచనలతో పాటు జెన్కో సిబ్బంది ప్రత్యేక కృషి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. జెన్కో సాధించిన అసాధారణ విజయం సందర్భంగా జెన్కో అధికారులతో గురువారం నాడు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయం నుంచే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జెన్కో అధికారులను అభినందించారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. జెన్కో సాధించిన రికార్డు ఉత్పత్తిలో పాలుపంచుకున్నసిబ్బంది అందరికీ మంత్రి గొట్టిపాటి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

**వేసవి విద్యుత్ అవసరాల కోసం ముందస్తు చర్యలు...**

రాబోయే వేసవిలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముందని మంత్రి గొట్టిపాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సంస్థలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గృహ, పారిశ్రామిక, వ్యాపార వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించే లక్ష్యంతో దానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తితో పాటు రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను కూడా విజయవంతంగా తీర్చడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సానుకూల సంకేతమని మంత్రి తెలిపారు. ముఖ్యంగా రాబోయే వేసవి నెలల్లో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. విద్యుత్ అంతరాయాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

**మౌలిక వసతుల బలోపేతంతో భారం తగ్గింపు...**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీ జెన్కో ను సర్వనాశనం చేశారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరలకు అత్యధికంగా విద్యుత్ కొనుగోలు చేసి రాష్ట్ర ప్రజల పై రూ. 32 వేల కోట్ల భారాన్ని మోపారని విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం వేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వినియోగదారులపై భారం తగ్గించేందుకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా 13 పైసల ట్రూ డౌన్ ను ఇప్పటికే అమలు చేసి కొత్త చరిత్ర సృష్టించిందని తెలిపారు. అదే విధంగా విద్యుత్ వ్యవస్థలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వేల కోట్ల రూపాయిలతో వందలాది సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. కొత్త విద్యుత్ లైన్లను కూడా వేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్కో ఎండీ పి పుల్లారెడ్డి, ఏపీ జెన్కో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

(తరువాయి 4లో...)

# సీఎం సహాయనిధితో
# పేదల జీవితాల్లో వెలుగులు

### ఎమ్మెల్యే ఏలూరి సిఫారసుతో రూ.2.05 లక్షల ఎల్ఓసి
### మార్టూరులో ముస్లిం పేద కుటుంబానికి అండగా సాంబన్న

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మార్చి 12)



పేద కుటుంబానికి చెందిన ముస్లిం మహిళకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆశాకిరణంగా మారింది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసుతో మార్టూరుకు చెందిన షేక్ సైదాభీకి రూ.2,05,387 వైద్య సహాయం మంజూరైంది. దీంతో ఆ కుటుంబంలో కొత్త ఆశలు చిగురించాయి. సైదాభీ భర్త షేక్ మహ్మద్ రఫీ మార్టూరులో చిన్న చిల్లర దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన వీరు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సైదాభీ గత పదేళ్లుగా నడుము వెన్నుపూస వంకర సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల సమస్య తీవ్రతరమై మంచానికే పరిమితమయ్యారు.మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని మల్లిక స్పైన్ హాస్పిటల్‌లో ఆమెను చేర్పించారు. అయితే చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితి రావడంతో కుటుంబ సభ్యులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆశ్రయించారు.వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి వెంటనే స్పందించి క్యాంపు కార్యాలయ ప్రతినిధులను ఆదేశించి మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి లేఖ రాశారు. ఆ వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,05,387 వైద్య సహాయం మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సిఫారసు మేరకు మంజూరైన చెక్కును తెలుగుదేశం పార్టీ నేతలు, క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఆ కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**10 ఏళ్లుగా నొప్పితో పోరాటం...** మార్టూరుకు చెందిన షేక్ సైదాభీ గత పదేళ్లుగా నడుము వెన్నుపూస వంకర సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల పరిస్థితి విషమించడంతో మంచానికే పరిమితమయ్యారు.

**చికిత్సకు అండగా సీఎంఆర్....** చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో (తరువాయి 4లో...)

# శింగరాయకొండ ఎమర్జెన్సీ లాండింగ్ అదనపు భూసేకరణ

### పునః పరిశీలనపై నితిన్ గడ్కరీని కలసిన మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 120

ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి నితిన్ గడ్కరిని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిశారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితులలో విమానాలు దిగేందుకు ప్రకాశం జిల్లా, శింగరాయకొండ వద్ద ఎమర్జెన్సీ లాండింగ్ గతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం సదరు ఎమర్జెన్సీ లాండింగునకు ఇరువైపుల మరికొంత భూమిని సేకరించుటకు కేంద్ర రోడ్డు రవాణ, హైవేస్ శాఖ వారు చేసిన ప్రతిపాదనల పై శింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు, కలికివాయి, కనుమల్ల పరిసర గ్రామాల ప్రజలు, స్థానిక నివాసులు, స్థలాలు - భూములు కలవారు ప్రస్తుత భూసేకరణ వలన (తరువాయి 4లో...)



# సూర్యలంక బీచ్‌ను గోవా బీచ్ మాదిరిగా అభివృద్ధి

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించిన కలెక్టర్ వినోద్‌కుమార్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మార్చి 12)

సూర్యలంక బీచ్ ను గోవా బీచ్ మాదిరిగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సు రెండవ రోజైన గురువారం బాపట్ల సూర్యలంక బీచ్ అభివృద్ధిపై చర్చ సాగింది. బీచ్ అభివృద్ధిపై రూపొందించిన ప్రణాళిక నివేదికను సీఎంకు అందించారు. స్పందించిన ముఖ్యమంత్రి బాపట్ల ను మరో గోవా బీచ్ చేస్తావా.. ఆ నమ్మకం ఆత్మవిశ్వాసం ఉందా.. అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను పీపీటీ ద్వారా వివరించిన కలెక్టర్‌ను సీఎం ప్రత్యేకంగా ప్రసంశించారు. బీచ్ షాక్స్ ఏర్పాటు పై పాలసీ తుది నిర్ణయం, ఆమోదం లభిస్తే వేగంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సీఎంకు వివరించారు. మూడు రోజులపాటు అధికారుల బృందం గోవాలో పర్యటించి అధ్యయనం చేశామన్నారు. దీనిపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించామన్నారు. మీ విజన్ మేరకు ప్రణాళిక రూపొందించామని, తద్వారా బాపట్ల బీచ్ పర్యాటకంగా అభివృద్ధి చేసితీరుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలం రాకముందే ఈ నూతన విధానాన్ని అమల్లోకి తెస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. నూతన విధానం అమల్లోకి వస్తే, బీచ్ ప్రాచుర్యంలోకి వస్తుంది, పర్యాటకంగానూ ఎంతగానో అభివృద్ధి చెందుతుందని, అక్టోబర్ ముందే ఫలితాలు చూడవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఆయన వివరించారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడానికి రూపొందించిన ప్రణాళికను వివరించి, చిన్న చిన్న సాంకేతిక సమస్యలను విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించారు. స్పందించిన ముఖ్యమంత్రి అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. (తరువాయి 4లో...)

# బాలికలకు వరం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ బాలికలకు వరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులతో కలిసి ఎమ్మెల్యే హెచ్‌పీవీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ పథకం అద్భుతమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ భవిష్యత్తులో బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు ఇటువంటి టీకాలు అత్యవసరమన్నారు. ప్రతిరోజు ఈ టీకా అందుబాటులో ఉంటుందని ఆరోగ్య

(తరువాయి 4లో...)

## 14న జాతీయ లోక్ అదాలత్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

దేశ అత్యున్నత న్యాయస్థానం వారి ఆదేశాల ప్రకారం దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోకాదాలతో భాగంగా ఈ నెల 14న ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్, ఇన్చార్జి ప్రధాన న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అన్ని రకాల సివిల్ కేసులు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు వివాహ సంబంధ వ్యాజ్యాలు, మోటారు వాహన ప్రమాద సంబంధ కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఇరు వర్గాల ఆమోదంతో పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కోర్టులలో నిల్వ ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ కేసులు పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడిన అన్ని సివిల్ కేసుల్లో కట్టిన కోర్టు ఫీజును తిరిగి కక్ష దారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కేసుల పరిష్కారం కోసం అన్ని న్యాయస్థానాలలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో 27 బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## 26వ డివిజన్‌లో పర్యటించిన టీడీపీ నగర కమిటీ బృందం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సూచనల మేరకు గురువారం 26వ డివిజన్‌లో కార్పొరేటర్ తిప్పర పల్లి రవితేజ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, నగర కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని శానిటైజేషన్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

## సమరశీల పోరాటాలతోనే హక్కుల సాధన

**ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

సమరశీల పోరాటాలతోనే సమాన హక్కులు, మహిళలకు చట్టాలు సాధించబడ్డాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఐద్వా జిల్లా కార్యాలయం యల్‌బిజి భవన్ వద్ద సీనియర్ నాయకురాలు వై అంజనీదేవి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 1981 మార్చి 10, 11, 12 తేదీలలో మద్రాసులో ఐద్వా మొదటి మహాసభ జరిగిందన్నారు. ఆనాటికి అనేక రాష్ట్రాల్లో స్థానికంగా మహిళా సంఘాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆ మహాసభలో దేశవ్యాప్తంగా ఒకే సంఘం ఉండాలని తీర్మానించి ఐద్వా ను ఏర్పాటు చేశారని వివరించారు. గత 45 ఏళ్ల కాలంలో దేశవ్యాప్తంగా మహిళా సమస్యల మీద నిరంతరం పోరాడుతూ, మహిళలకు అనేక హక్కుల కోసం, చట్టాల అమలు కోసం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. నేడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించి, కోటీ నలభై లక్షల సభ్యత్వంతో అతిపెద్ద మహిళా సంఘంగా ఐద్వా అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి ప్రధాన లక్ష్యాలుగా ఐద్వా పని చేస్తున్నదని, సమాజంలో వేళ్ళూనుకుని వున్న పితృస్వామి భావజాలానికి వ్యతిరేకంగా మహిళలను చైతన్య పరుస్తూ ముందుకు వెళుతుందని అన్నారు. భారత రాజ్యాంగం స్త్రీ పురుషులకు సమానహక్కులు ఇచ్చిందని కేంద్ర లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా హక్కులు కాలరాయబడుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేసే మనువాద భావజాలాన్ని మహిళలపై రుద్దుతా ఉందని ఈ భావజాలాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాల్లు జి ఆదిలక్ష్మీ, ఎన్ మాలతి, బి గోవిందమ్మ, బి రాజ్యలక్ష్మి, జి నాగేశ్వరమ్మ, పి లక్ష్మి, కె రాణి పాల్గొన్నారు.

## 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో ఏపీ జెన్కో చారిత్రాత్మక రికార్డు



## సూర్యలంక బీచ్‌ను గోవా బీచ్ మాదిరిగా అభివృద్ధి



## బాలికలకు వరం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

కేంద్రానికి వచ్చి బాలికలు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని తెలిపారు. అవసరాన్ని బట్టి ఆదివారాలు, సెలవు దినాల్లోనూ వేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ వాణిశ్రీ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సృజన, సిహెచ్‌ఓ నాగేందర్‌రెడ్డి, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.







## సీఎం సహాయనిధితో పేదల జీవితాల్లో వెలుగులు

కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరిని ఆశ్రయించగా, సీఎం సహాయనిధి ద్వారా రూ.2,05,387 మంజూరయ్యేలా సిఫార్సు చేశారు.

**చిల్లర దుకాణమే కుటుంబానికి ఆధారం....**

బాధితురాలి భర్త షేక్ మహ్మద్ రఫీ చిన్న చిల్లర దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య ఈ సహాయం కుటుంబానికి పెద్ద ఊరటనిచ్చింది.

## శింగరాయకొండ ఎమర్జెన్సీ లాండింగ్ అదనపు భూసేకరణ

వారి స్థానిక నివాసాలకు, వ్యవసాయ కార్యకలాపాలకు, రోజువారి పనులకు ఎన్నో ఇబ్బందులు అంతరాయాలు కలుగుతాయని, ఈ విషయం పై స్థానికంగా విస్తృత సంప్రదింపులు, అంచనా అవసరమున్నదని, కనుక సదరు విషయాన్ని తిరిగి పరిశీలించాలని ఎంపి మాగుంట కోరారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, విమానయాన భద్రత జాతీయ అత్యున్నత ప్రాదాన్యతలతోపాటు, స్థానిక ఇబ్బందులను కూడా దృష్టిలో వుంచుకొని వారి విజ్ఞప్తిని పరిశీలించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని మాగుంట శ్రీనివాసులురెడ్డి లేఖ ద్వారా కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి ప్రత్యేక బృందాన్ని పంపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు ఎంపి మాగుంట ఓ ప్రకటనలో తెలిపారు.

## విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో కోదండరామస్వామి విగ్రహాలు వితరణ

**విగ్రహాలకు రూ.45వేలు విరాళం అందజేసిన పెద్దిరెడ్డి విశ్వనాథరెడ్డి**









(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 12)

బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్డు మున్సిపాలిటీ కార్మికులు నివాసం ఉండే జాంబవంత నగర్ లోని కోదండ రామాలయం పునర్నిర్మాణం కార్యక్రమంలో భాగంగా స్వామివారి సీతా రామలక్ష్మణులు ఆంజనేయ స్వామి మూల విరాట్ విగ్రహాలకు తిప్పనపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మల్లారెడ్డి సతీమణి కీర్తిశేషులు సుబ్బ లక్ష్మమ్మ కుమారుడు విశ్వనాథరెడ్డి వారి సతీమణి శ్రీదేవి కుటుంబ సభ్యులు సహకారంతో 45 వేల రూపాయలు విరాళం స్వామివారి మూలవిరాట్లకు వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా గురువారం ఆలయ కమిటీ సభ్యులు సి,వి నాగేశ్వరరావు, వల్లంకొండు వెంకటరమణాలకు వారు అందజేశారు. జాంబవంత నగర్ లోని అనేక మంది మున్సిపాలిటీ కార్మికులు మున్సిపాలిటీలో పారిశుద్ధ పనులు చేసుకుంటూ వారికి వచ్చిన వేతనంలో వారి కుటుంబ ఖర్చులు నిర్వహించుకుంటూ కొంత ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగింది. కోదండ రామాలయం స్లాబ్ వరకు వేసిన వారి ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో దేవాలయం పనులు ఆగిపోయాయి. ఇటీవల పదిమంది కమిటీతో రంగంలోకి దిగి స్వామివారి దేవాలయం పున నిర్మాణం విగ్ర ప్రతిష్ట చేపట్టాలని పలువురు దాతల సహాయ సహకారాలతో దాదాపు 90% ఆలయ నిర్మాణం పూర్తయింది త్వరలోనే పలువురు దాతలు సహకారంతో విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. మరికొందరు దాతలు సహృదయంతో ముందుకు వచ్చి జాంబవంత నగర్ లోని కోదండ రామాలయానికి సహకరించి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని పలువురు కమిటీ సభ్యులు పలువురు దాతలను కోరడం జరిగింది. కువైట్లో ఉంటున్నటువంటి పెద్దిరెడ్డి విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు సహృదయంతో ముందుకు వచ్చి స్వామివారి విగ్రహాలకు వారి వంతు సహాయ సహకారాలు అందించడం పట్ల పెద్దిరెడ్డి విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది.

**ఆళ్లగడ్డలో విగ్రహాలు పరిశీలన :**

జాంబవంతు నగర్ కోదండ రామాలయం వానికి స్వామివారి సీతారామ లక్ష్మణులు ఆంజనేయ స్వామి వారి విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు వల్లంకొండు వెంకటరమణ, కే వీ సుబ్బారావు, పెద్ది సుధాకర్, సివి నాగేశ్వరరావు, కాలువ నాగేంద్ర తో పాటు పలువురు ఆళ్లగడ్డలోని విగ్రహాలను పరిశీలించి స్వామి వారి విగ్రహాలకు పెద్దిరెడ్డి విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో అడ్వాన్స్ ఇవ్వడం జరిగింది. రేపు నెలలో జరగబోవు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది. బద్వేల్ ప్రాంత ప్రజల సాయి సహకారాలతో త్వరలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పలువురికి తెలిపారు.

# ఘనంగా వైఎస్ఆర్సిపి 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 12)
మండల కేంద్రమైన ఉలవపాడులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పర్యవేక్షణలో గురువారం 16వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం దగ్గర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఘనంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పార్టీ 16వ ఆవిర్భావంలో భాగంగా జెండాను ఎగురవేసి తదనంతరం 16 కేజీల కేకును మండల పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో అధ్యక్షులు నన్నం పోతురాజు, వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు కట్ చేసి కార్యక్రమాన్ని జయప్రదంచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు, రాష్ట్ర పార్టీ జనరల్ సెక్రెటరీ వెలిచర్ల ధనకోటి, జిల్లా నాయకులు వేమూరి వెంకటేశ్వర్లు, జమ్ము మాధవ, వెలిచెర్ల చంద్రశేఖర్, షేక్ సంధాని, మండల వైస్ ఎంపీపీ, నియోజకవర్గ



ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఫజల్, యువజన విభాగ అధ్యక్షుడు మద్దసాని నవీన్, ఐటి వింగ్ అధ్యక్షులు పాలవల్లి అమర్‌నాథ్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సయ్యద్ సుల్తాన్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాషా, ఉలవపాడు ఎంపీటీసీ సభ్యులు రాధామాధవి, మండల యువజన విభాగం అధ్యక్షుడు అమ్మనబ్రోలు వెంగళరావు, బిసి సెల్ అధ్యక్షులు కె సురేష్, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ దస్తగిరి సాహేబ్, మండల యస్‌సి సెల్ అధ్యక్షులు రాయపాటి శివ, కె రవి, వాలంటరీ వింగ్ అధ్యక్షులు ఆవుల రాంబాబు, మండల సభ్యులు మానం సుబ్బారావు, కొత్తా ప్రభాకర్‌రెడ్డి, టి శ్రీనివాసరెడ్డి, యల్ చంద్రశేఖర్, డి రాము, డి తిరుపాలు, టి ప్రకాశం, వై మాధవ, సయ్యద్ సాహుల్, జంపని అనురాధ, ఆర్ జాలరావు, పెదపట్టపుపాలెం పార్టి అధ్యక్షులు అవుల డాక్టర్ బాబు, యన్ లక్ష్మినారాయణ, కె అనీల్‌రెడ్డి, వై శివాజీ, బి సురేష్, రవి, రమేష్, అశ్వీరాధం, మదన్, సోషల్ మీడియా అధ్యక్షులు ఆలూరి మధు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు పెన్ను, ప్యాడ్‌లు పంపిణీ









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 12)
మండలంలోని కరేడు గ్రామంలో పాతాళ వెంకటసుబ్బయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీ కస్తూరిబా గాంధీ హాస్టల్, గిరిజన బాలుర హాస్టల్, బాలికల హాస్టల్ నందు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెప్పి పెన్ను, పాడ్ లను టిడిపి సీనియర్ నాయకులు చెంచురామిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రాంబాబు, టిడిపి అధ్యక్షుడు నేలటూరి ఆధాం, మాజీ అధ్యక్షుడు కన్నా ప్రసాద్, టిడిపి నాయకులు పోలిరెడ్డి, బాలచంద్ర, మరిబోయిన వెంకయ్య, బిజెపి ప్రకాశం జిల్లా సెక్రెటరీ పి శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పిపి వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా








(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 12)
మహిళలకు గర్భాశయ క్యాన్సర్లు పెరుగుతున్నందున గర్భాశయ క్యాన్సర్లను నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సుగుణ్ కుమార్, శరత్ చంద్రల ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి పిల్లలకు వ్యాక్సినేషన్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని ఉప్పలపాడు, పొదిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 14 సంవత్సరాలు పైబడిన యువతులకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గర్భాశయ క్యాన్సర్లను నిరోధించడానికి దాదాపు 4వేల రూపాయల పైన విలువ ఉండే ఈ వ్యాక్సిన్ ను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం దాదాపుగా మూడు నెలలు జరుగుతుందన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. 14 సంవత్సరాలు పైబడిన యువతులు ఎవరైతే ఈ వ్యాక్సిన్ ఇంకా వేయించుకోలేదో వారు ప్రతి మంగళవారం, శుక్రవారం జరిగే వ్యాక్సినేషన్ కార్యక్రమాలలో ఈ హెచ్‌పివి వ్యాక్సిన్ ను వేయించుకోవాలని కోరారు. ఈ వ్యాక్సిన్ పైన పూర్తి సమాచారం కొరకు దగ్గర్లోని ఏఎన్ఎం, ఆశలను సంప్రదించి ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, ఆరోగ్య సిబ్బంది ఎన్ శ్రీను, ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకా అవసరం

### రితేష్ కుమార్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, గోపవరం, మార్చి 12)
బాలికలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షించేందుకు హెచ్‌పీవీ టీకా ఎంతో ముఖ్యమని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం బద్వేలు మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు 14 నుంచి 15 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తున్నాయని తెలిపారు. చిన్న వయస్సులోనే ఈ టీకా వేయించుకోవడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి బాలిక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి రాజేష్ కుమార్ మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కంటే ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం ఎంతో మంచిదని చెప్పారు. ముఖ్యంగా బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించి ఈ టీకా వేయించేందుకు ముందుకు రావాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో 14 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు గల 19 మంది బాలికలు టీకా వేయించుకున్నారు. టీకా అనంతరం వారికి సర్టిఫికెట్లు కూడా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంగళరెడ్డి, మనోహర్ రెడ్డి బెనర్జీ, సుధాకర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ జె. వినయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి. వెంగయ్య, కె. చంద్రావతి, స్టాఫ్ నర్స్ మాధవి, హెల్త్ అసిస్టెంట్ వి. జనార్దన్ రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్‌కు ఘన నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 120
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి స్థాపించి 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16 వసంతంలోనికి అడుగు పెట్టిన సందర్భంగా మార్కాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ అన్న వెంకట రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నందు జెండా ఆవిష్కరించి, అనంతరం వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి గడియార స్తంభం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బత్తుల అశోక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌ను కలిసిన చెంచురామిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 12)
ప్రకాశం జిల్లా పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్, వెంకటరమణ హాస్పిటల్ అధినేత డాక్టర్ సీతారామయ్యని కరేడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుంకర చెంచురామిరెడ్డి మర్యాదపూర్వకంగా, ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత మంచినీటి చలివేంద్రం ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మార్చి 12)
మండలంలోని స్థానిక తాహసిల్దార్ కార్యాలయం వద్ద ఉచిత మంచినీటి చలివేంద్రం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం చలివేంద్రాన్ని తెలుగుదేశం నాయకులు, మాజీ మండల పార్టీ అద్యక్షుడు మోటకట్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్ లు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలు ప్రతి గ్రామంలో రామాలయాల వద్ద, బస్టాండ్‌ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్ఆర్‌సిపి 16వ ఆవిర్భావ దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 12)
రాష్ట్ర అంగనవాడి వింగ్ సెక్రటరీ ఉడుముల వరలక్ష్మమ్మ ఆధ్వర్యంలో గురువారం వైస్సార్సీపీ 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలుఘనంగా నిర్వహించారు. వైయస్సార్సీపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు ఆదేశాల మేరకు పొదిలి మార్కాపురం అడ్డ రోడ్డులోని దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వైఎస్ఆర్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పొదిలి పట్టణ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, నాయకులు గొలమారి చెన్నారెడ్డి, గుంటూరు నాగిరెడ్డి, రబ్బానీ, ఫిరోజ్, గుంటూరి శ్రీనివాసరెడ్డి, బోనం బ్రహ్మారెడ్డి, పులగొర్ల శ్రీనివాస్ యాదవ్, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మోర అరుణ, వెంకట్రావు, గుంటూరి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నోట్లో ఇరుక్కున్న చేప పిల్లను సర్జరీ చేసి బయటకి తీసిన రిమ్స్ వైద్యులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)





చేపల కూర ఎవరికైనా ఎందుకు ఇష్టం ఉండదు. గుటుక్కున నోట్లో వేసుకుంటాం. అయితే బ్రతికి ఉన్న చేపను తినలేం కదా. ఇలా అనుకోకుండా ఒకరి నోట్లో అదేనండి గొంతులో బ్రతికిన చేప ఇరుక్కుంటే.... ఇలాంటి ఘటన ప్రకాశం జిల్లాలో జరిగింది. ఒంగోలుకు చెందిన సుబ్రహ్మణ్యం వేటకు వెళ్లి వచ్చాక వల నుంచి చేపలను వేరు చేస్తున్న క్రమంలో నోట్లో వలను పట్టుకొన్న సమయంలో చేప నోట్లకి వెళ్లినట్టు చెప్పారు. బ్రతికిన చేప నోట్లోకి వెళ్లి గొంతులో ఇరుక్కుంది. ఇక కక్క లేక మింగలేక ఆ జాలరి పాట్లు అన్ని ఇన్ని కావు.. ఇక చేసేదేమి లేక సదరు మత్స్యకారుడిని ఒంగోలులో జిజిహెచ్ అత్యవసర విభాగంలో చేర్పించగా గొంతు లో చేప ఉందని గుర్తించి ఈఎన్‌టి విభాగానికి సిఫారసు చేసారు. ఈఎన్‌టి వైద్యులను సంప్రదించారు. ఈఎన్‌టి విభాగ అధిపతి డాక్టర్ ప్రభాకర్ నేతృత్వంలోని వైద్యులు పరిశీలించి శస్త్ర చికిత్స అవసరమని భావించారు. దీంతో అనస్థీషియా విభాగాన్ని కూడా సంప్రదించి మత్తు ఇచ్చి చేపను బయటకు తియ్యాలి అని నిర్ణయించారు. సదరు మత్యకారుడు కుటుంబ సభ్యుల అనుమతితో దాదాపు గంట పాటు ట్రాకియాస్టిమి పద్ధతిలో చేపను విజయవంతంగా బయటకు తీశారు. ఇలా చేపను బయటకు తియ్యడంతో సదరు మత్స్యకారుడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ క్లిష్టతరమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు అభినందించారు. శస్త్రచికిత్సను నిర్వహించిన బృందంలో ఈఎన్‌టి విభాగ అధిపతి డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ కవిత, డాక్టర్ అర్జున్, డాక్టర్ లాలసలకు అభినందనలు తెలిపారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 12)

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మార్కాపురంలోని కలెక్టరేట్లో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్కాపురం జిల్లాలో ఎక్కడెక్కడ నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది, వాటి పరిష్కార మార్గాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకొని అవసరమైన పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో తిరిగి సమస్యలను అంచనా వేసుకొని తగు చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్యలు తర్వాత కుండా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ సురేష్ బాబు, డిపిహెచ్ఇఓ శ్రీనివాసరావు, గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణ బాబు, ఇతర మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

## గ్రామంలో ఫాగింగ్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 120

ఉలవపాడు పంచాయతీ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ వారి ఆధ్వర్యంలో గురువారం దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్ నిర్వహించారు. శనివారం కొల్లూరుపాడు, రాజుపాలెం గ్రామాలలో ఫాగింగ్ నిర్వహించడం జరుగుతుందని ఉలవపాడు పంచాయతీ సెక్రటరీ వీరయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అన్నదాత సుఖీభవ 3వ విడత, పిఎం కిసాన్ 22వ విడత నిధులు విడుదల

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 120

శుక్రవారం అన్నదాత సుఖీభవ 3వ విడత, పీఎంకిసాన్ 22వ విడత నిధులు విడుదల కార్యక్రమం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుండి సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అలాగే జాతీయ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి అస్సాంలోని గౌహతి నందు సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని రైతు సేవా కేంద్రాలలో స్మార్ట్ టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని 5 మండలాలకు సంబంధించి పిఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా 27,919 మంది రైతులకు 2000 చొప్పున రూ.5.58 కోట్ల రూపాయలు అలాగే అన్నదాత సుఖీభవ పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం వారు రూ.31,853 మంది రైతులకు గాను రూ.12.74 కోట్ల నగదు విడుదల చేయనున్నారని తెలిపారు. దీనికి సంబంధించి నియోజకవర్గ స్థాయి కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం కందుకూరు నందు సాయంత్రం 4 గంటలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు. కావున రైతు సోదరులు, రైతు మహిళలు, గ్రామ నాయకులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

## దోమలు నివారించే స్ప్రే మిషన్‌ను అందించిన 14, 15 డివిజన్ నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు సూచనలు మేరకు గురువారం 14, 15 డివిజన్లో 15 డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ ఆధ్వర్యంలో దోమలను నివారించడానికి ఎలక్ట్రికల్ స్ప్రే మిషన్‌ను కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. లక్కవరపు అరుణ, బెజవాడ ఆంజనేయులు మున్సిపాలిటీకి బహుమతిగా స్ప్రే మిషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, హగ్గయ్య రాజ్, రవి, 14, 15 డివిజన్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూర్బన్ పంచాయతీల పేరుతో పేదల పొట్టు కొట్టొద్దు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి



కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 12)

రూర్బన్ పంచాయతీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను పట్టణాలతో అనుసంధానం చేసేటటువంటి పథకాన్ని తెస్తున్నారని, ఆ గ్రామాలలో ఉపాధి హామీ చట్టం రద్దయే ప్రమాదం ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశం కొమ్మాలపాటి మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు పట్టణ సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో 10వేల జనాభా ఉన్న గ్రామాలను రూర్బన్ (రూరల్ అర్బన్ కలిపిన పేరు) పంచాయతీగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గ్రామాలకు పట్టణ సౌకర్యాలు కల్పించడం మంచిదే అయినా, గ్రామీణ ప్రాంత పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టం ఆ గ్రామాల్లో అమలు చేస్తారా లేదా రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లుగా చేసిన సందర్భంలోనూ, నగర పంచాయతీలుగా మార్చిన సందర్భంలోనూ పేదలు ఉపాధి హామీ చట్టాన్ని కోల్పోయారని అన్నారు. నేడు రూర్బన్ పద్ధతిలో అటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఇరాన్ లో జరుగుతున్న యుద్ధం కారణం చూపి గృహ వినియోగదారుల వంటగ్యాస్ సిలిండర్ ధరలు రూ.60, వాణిజ్య అవసరాల గ్యాస్ సిలిండర్ ధర రూ.115లకు పెంచటం అన్యాయమని అన్నారు. దీనిని ఆసరా చేసుకొని గ్యాస్ సిలిండర్లు సరఫరా సంస్థలు సిలిండర్లు బ్లాక్ చేసి విపరీతమైన ధరలకు అమ్ముతున్నామని, అనేక అపోహలు పెరుగుతున్నాయన్నారు. దీంతో హాస్టల్లు, హోటల్లు ఇతర వాణిజ్య అవసరాలకు సిలిండర్ల సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం కలుగజేసుకొని సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నాడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయడం కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపాలని అన్నారు. రెండేళ్లు గడిచినా ప్రకటించిన పథకాలు ఇంకా అమలులోకి రాలేదని, ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోతే భవిష్యత్తులో ప్రజలను సమీకరించి ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం జిల్లా నూతన కమిటీని 17 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా కొమ్మలపాటి మాల్యాద్రి, కార్యదర్శిగా గుమ్మా బాలనాగయ్య, ఉపాధ్యక్షులుగా కొండ్రు వెంకటమ్మ, సహాయ కార్యదర్శిలుగా తురకా ఏడుకొండలు, బి రత్నం ఎన్నికయ్యారు. సభకు ముందుగా సంఘం జండాను ఆవిష్కరణ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు డీకేఎం రఫీ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు సౌహార్ధ సందేశాలు ఇచ్చారు.

## భద్రతా నియమాలు పాటించని కట్టెల లోడ్ ట్రాక్టర్ల సీజ్

ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 12)

జాతీయ రహదారి మీద అర్ధరాత్రి వేళలో కనీస రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా కావలి వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న రెండు కట్టెల లోడు ట్రాక్టర్లను ఉలవపాడు పోలీసులు గురువారం సీజ్ చేసి కేసు నమోదు చేశారు. త్వరలో కోర్టుకు పెట్టి నిబంధనలు పాటించని డ్రైవర్లకు శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రైలర్ యొక్క డోర్లు ఓపెన్ చేసి వాటిపైన కట్టెలు పేర్చడం వల్ల వెనుక వచ్చే వాహనాలకు ముందు వెళ్ళే వాహనాన్ని గమనించే అవకాశం ఉండడం లేదన్నారు. ట్రైలర్ కి రేడియం స్టిక్కర్లు, లైట్లు లేకపోవడం వల్ల వెనుక వాహనాలకు కనిపించడం లేదని తెలిపారు. రాత్రి వేళల్లో కట్టెల లోడు ట్రాక్టర్ లు జాతీయ రహదారిలో వెళ్లకూడదన్నారు. డ్రైవర్లు సరైన పత్రాలు కలిగి ఉండడం లేదన్నారు. వ్యవసాయ పనులకు వాడాల్సిన ట్రాక్టర్లను జాతీయ రహదారి మీద నడపకూడదని తెలిపారు. కొంత మంది డ్రైవర్లు నిర్ణీత వయస్సు లేకుండా ట్రాక్టర్ లు నడుపుతున్నారని తెలిపారు. జాతీయ రహదారి మీద రాత్రి వేళల్లో కట్టెల లోడుతో వెళుతూ ప్రమాదాలకు కారణం అయ్యే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని, భారీ జరిమానా విధించేలా చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

## హరికృష్ణ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 12)

మండలంలోని మన్నేటికోట గ్రామంలో చిమ్మిరి హరికృష్ణ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పాల్గొన్నారు. ముందుగా హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పలకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులివర్తి బసవయ్య నాయుడు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చిమ్మిరి వంశీ, మాజీ సర్పంచ్ నారాయణ, నల్లూరి నాయుడు, చిమ్మిరి మోహన్‌రావు, తదితరులు పాల్గొని హరికృష్ణకు నివాళులర్పించారు.





## ఘనంగా వైఎస్‌ఆర్‌సిపి ఆవిర్భావ వేడుకలు









(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 12)

మండల కేంద్రమైన పొన్నలూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో పొన్నలూరు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వై.యస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి తండ్రి ఆశయ సాధన కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి నేటికీ 16 వసంతాలు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం అని నాడు జగన్మోహన్‌రెడ్డి, తన తల్లి వై యస్ విజయమ్మ ఇద్దరి తో పురుడు పోసుకున్న పార్టీ నేడు కోట్ల మందిలో విస్తరించిందని కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేదవాడు సమాజంలో గర్వంగా జీవించే విధంగా గత ఐదు సంవత్సరాల పాలనలో జగన్మోహన్ రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారని. పేద ప్రజల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని పలువురు పొన్నలూరు మండలం వైసిపి నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు, స్టేట్ ఆర్టిఐ వింగ్ కార్యదర్శి పిల్లి తిరుపతిరెడ్డి, స్టేట్ పంచాయతీరాజ్ సెక్రటరీ పల్లపోలు బాలకోటిరెడ్డి, గడ్డం మాల్యాద్రి, మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, కాట మాధవరావు, యర్రా రామకృష్ణ, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, గుత్తికొండ కళ్యాణి, కట్టా కరుణాకర్, గౌడ పేరు విజయ్ కుమార్, అనుమోలు ప్రసాద్ , యర్రా గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ మాన్యం ఆక్రమించిన వైసీపీ రెడ్లను అరెస్టు చేయాలి

## దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతనూతలపాడు మాదిగ మాన్యం ఆక్రమించిన వైసీపీ రెడ్లను అరెస్టు చేయించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. వారికి సహకరించిన తెలుగుదేశం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, తెలుగుదేశం భూ స్వాహా నాయకుడు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలన్నారు. మాదిగ మాన్యం భూమి ఆక్రమణ పై జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటించని ఒంగోలు ఆర్డీవో పై చర్య తీసుకోవాలని, మాదిగ మాన్యం ఆక్రమించి పంట ధ్వంసం చేసిన దుంపా సంగ్రామరెడ్డి ల్యాండ్ గ్రాబింగ్ కేసులో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం అరెస్టు చేయాలన్నారు. భూకబ్జా కి సహకరిస్తున్న సంతనూతలపాడు ఎమ్మార్వో, ఎస్ఐలను సస్పెండ్ చేయాలన్నారు. గురువారం ఒంగోలు హెచ్‌సిఎం కాలేజీ ఎదురుగా నున్న అంబేద్కర్ విగ్రహం వద్ద సంతనూతలపాడు మాదిగ మాన్యం దురాక్రమణ పై పోలీసు రెవెన్యూ అధికారుల అవినీతి అలసత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం ఆస్తులు చేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ దుంప సంగ్రామిరెడ్డి దుంపా శ్రీలక్ష్మి అను రెడ్ల కులస్తులు నాగేశ్వరరావు, బొమ్మల దేవ సహాయం తదితరుల పై క్రైమ్ నెంబర్ 89/2012 కేసుగా ఫిర్యాదు చేసి ఉన్నారని చెప్పారు. 2012వ సంవత్సరంలోనే భూమి తనదని, తమ భూమిని ఆక్రమించారని చేసిన కేసు విచారణ జరిపి 2018 సంవత్సరం ఫిబ్రవరి 22వ తారీఖున స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు వారు కేసు కొట్టి వేశారు. అదే విధంగా రికార్డ్ ఆఫ్ హోల్డింగ్స్ లో కూడా సర్వే నెంబర్ 306లో బొమ్మల చెంచు, అట్లూరి నాగడు పేర్లతో మాదిగ మాన్యం రికార్డ్ అయి ఉంది. తరువాత ఈ మాదిగ మన్యం భూమిని దొంగ డాక్యుమెంట్లతో మాదిగ హక్కు దారులను భయభ్రాంతులు గురి చేసి పోలీసులతో బెదిరిస్తూ అక్రమంగా 19 ఎకరాలు ఆక్రమించుకున్నారన్నారు. ప్రస్తుతం బొమ్మల దేవ సహాయం, అట్లూరు నాగేశ్వరరావు, వంకాయలపాటి బాపమ్మలకు ఒక్కొక్కరికి 78 సెంట్లు చొప్పున మాదిగ మన్యం భూమి కలదు. ఈ భూమిపై జిల్లా కలెక్టర్‌కు 15 సంవత్సరాల నుండి ఫిర్యాదు చేస్తూ ఉన్నారు. ఆర్డిఓ ఎమ్మార్వోల విచారణ పేరుతో పోలీస్ బెదిరింపులకు కాలం గడిచిపోతుంది. ఈ క్రమంలో 2022వ సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్వపు ఆర్‌డిఓ రుశ్వేశ్వరరావు ప్రస్తుతం ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న కూడా మాదిగ మన్యం సందర్శించకుండానే ఎమ్మార్వో రిపోర్టుల పై ఆధారపడి జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటించటం లేదని అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రాజా బాబుకు మాదిగ మాన్యం భూమిపై ఫిర్యాదు చేయగా ఒంగోలు ఆర్డిఓ ను విచారణ జరిపి రికార్డు వివరాలతో సహా రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. రెండు వారాలు అవుతున్న ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న ఒంగోలుకు కోతవేటు దూరములో ఉన్న సంతనూతలపాడు మాదిగ మాన్యాన్ని సందర్శించలేదు, కలెక్టరేట్కు రిపోర్టు ఇవ్వలేదు. గత సంవత్సరం జూలై 17వ తేదీన సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబు పంట ధ్వంసం చేసి ఆక్రమించిన దుంపా రెడ్ల పై కేసు రిజిస్టర్ చేయలేదు. కానీ దుంప సంగ్రామిరెడ్డి బంధువులైన కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మరియు వారి బంధువైన తెలుగుదేశం నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి ప్రోత్సాహంతో మాదిగ మాన్యం హక్కుదారులైన బొమ్మల దేవసహాయం, అట్లూరు నాగయ్య తదితరులపై కేసు రిజిస్టర్ చేశారు. ఈ సంవత్సరం జనవరి 21వ తేదీన మరలా వైసిపి దుంపా సంగ్రామిరెడ్డి భూ కబ్జాకు పాల్పడి, మాదిగ మాన్యం చుట్టూ రేకులు వేసి ఫెన్సింగ్ వేశారన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మాదిగ మాన్యం బాధితుల ఫిర్యాదును సంతనూతలపాడు ఎస్ఐ స్వీకరించలేదన్నారు. మాదిగ మాన్యం పంటను ధ్వంసం చేసి చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేచిన దుంపా సంగ్రామరెడ్డి ల్యాండ్ గ్రాబింగ్, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం అరెస్టు చేయాలని నీలం డిమాండ్ చేశారు. అలాగే మాదిగ మాన్యం భూ ఆక్రమణకు పాల్పడిన దుంపా రెడ్ల కి సహకరిస్తున్న సంతనూతలపాడు ఎస్ఐ జయబాబు, సంతనూతలపాడు ఎమ్మార్వో లక్ష్మణ్ నారాయణరెడ్డిలను సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ యాక్టివ్ సెక్షన్ ప్రకారం అరెస్టు చేయాలన్నారు. భూ అక్రమణాలను సహించేది లేదంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతనూతలపాడులో మాదిగ భూమిని ఆక్రమించుకొని కంచవేసిన వైసిపి రెడ్ల పై కేసు నమోదు చేయించి అరెస్టు చేయాలన్నారు. మాదిగ మాన్యం ఆక్రమించిన వైసీపీ రెడ్ల బంధువు అయినా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని భూ కబ్జా ఆరోపణలు ఉన్న తెలుగుదేశం నాయకుడు సూర్య ప్రకాష్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ చేయాలని నీలం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మాదిగ మాన్యం హక్కుదారులు బొమ్మల దేవసహాయం, హైకోర్టు న్యాయవాది చక్రవర్తి, స్థానిక న్యాయవాది సృజన్ రాజు, మాదిగ సంక్షేమ వేదిక నాయకులు అట్రా బంగారం, బొమ్మల వంశీ, మాల మహానాడు నాయకులు మేడికొండ మురళి, కాకుమాను రవి, తదితరులు ఉన్నారు.



## నారా లోకేష్‌కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఇంటూరి







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 12)

నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె దగ్గర సాగర్ డిఫెన్స్ పరిశ్రమకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీ, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నారా లోకేష్‌కి స్వాగతం పలికి, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం





(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, మార్చి 12)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు మండల పార్టీ కార్యాలయంలో వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ స్థాపన లక్ష్యాలను స్మరించుకున్నారు. ప్రజా సేవే ధ్యేయంగా పార్టీ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి ఓకే రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎంపీటీసీ సభ్యులు భూమిరెడ్డి కొండారెడ్డి,మూలె నారాయణ రెడ్డి, మైల కొండయ్య, సర్పంచ్ల సంఘం అధ్యక్షులు పరిమి వెంకట్రావు చౌదరి, యూత్ అధ్యక్షులు మేకల మాల్యాద్రి, యర్రంరెడ్డి మోహన్ రెడ్డి, శీలం సుదర్శన్, పరుచూరి రమేష్ గౌడ్, రేగుల బాలయ్య చౌదరి, ఉండెల వెంగళరెడ్డి, వీరపనేని చెన్నయ్య చౌదరి, అత్యాల ఇస్సాక్, వెన్నం దివ్య, చిరిపిరెడ్డి సరస్వతి, నడికొట్టు రమణారెడ్డి, గుడిమెట్ల వెంకటేశ్వర్లు, అంట్రా వెంకట్రావు, తోటేటి నాగేశ్వరరావు, గుంటగాని రాజేష్, పిచ్చియ్య, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కాంచాని లక్ష్మీరెడ్డి, ఇల్లూరి గురుస్వామి రెడ్డి, వేమూరి సుబ్బారావు, నేలపాటి డేవిడ్, బండారు కృష్ణ, మూలె శివారెడ్డి, వల్లెం మాల్యాద్రి, కొడవటిగంటి ఏసు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీకర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మార్చి 12)

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక పట్టాభి రామస్వామి ఆలయ ప్రాంగణంలో మార్కాపురం శ్రీకర్ హాస్పిటల్ డాక్టర్ భవనం అనూష ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులు సుమారు వంద మంది పాల్గొన్నారు. వీరందరికీ డాక్టర్ భవనం అనూష వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో కొంత మందికి ఎక్కువ కంటి సమస్యతో బాధపడుతున్న వారిని త్వరలో ఆపరేషన్ చేయించుకోమని సూచించడం జరిగింది. నీటి కాసులతో బాధపడుతున్న వారికి కేవలం రూ. 5వేల తోనే ఆపరేషన్ చేసి కంటి చూపు సమస్య నుండి విముక్తి పొందేందుకు వారు కృషి చేస్తానన్నారు. ఈ హాస్పిటల్లో పేద బలహీన వర్గాలకు చెందిన వారికి ఎల్లవేళలా అందుబాటులో వైద్యం లభిస్తుందన్నారు. అంతే కాక వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురంలో హాస్పిటల్ ప్రారంభించిన సంవత్సరం కాలంలోనే ఎక్కువ ప్రజాదరణ పొందిందన్నారు. ఈ వైద్యశాలలో ఎముకలు, కీళ్లు, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మానికొండ విశ్రాంతరెడ్డి తక్కువ ఖర్చుకే తక్కువ కోతతో ఎక్కువగా సర్జరీ చేయకుండా ఫారెన్ ఇంప్లాంట్‌తో ఆపరేషన్ చేసి అదే రోజు నడిపించడం కూడా జరుగుతుందన్నారు. ఈ హాస్పిటల్లో ఎముకలు, కీళ్లు, మెడనొప్పితో బాధపడుతున్న వారందరూ ఈ హాస్పిటల్‌లో చికిత్సలు పొంది నూటికి నూరు శాతం విజయవంతమైన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సామాన్య ప్రజలకు ఇక్కడ వైద్యం అందుబాటులో ఉంటుందని డాక్టర్ భవనం అనుష పేర్కొన్నారు. పైన తెలిపిన సమస్యలతో బాధపడుతున్న ప్రతి సామాన్యులు ఈ హాస్పిటల్లో వైద్యం కోసం సంప్రదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది మహేష్, సుభాని, కేశవ, ఆనంద్, అధిక సంఖ్యలో రోగులు పాల్గొన్నారు.

## ఘనంగా వైస్సార్సీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 12)

పట్టణంలోని కందులాపురం సెంటర్‌లో వైఎస్సార్సీపి 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కుందూరు నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి, డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు “జై జగనన్న” నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కుందూరు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ పార్టీ ప్రజల సంక్షేమం కోసం పుట్టిన పార్టీ అని పేర్కొన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చూపిన సంక్షేమ పాలన మార్గంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేసి ప్రజల మనసుల్లో స్థానం సంపాదించారని తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలందరూ ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. 2029లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని, గిద్దలూరు నియోజకవర్గాన్ని జగనన్నకు గిఫ్ట్‌గా ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నెమలిదిన్నె చెన్నారెడ్డి,యువ నాయకులు, మహిళా నాయకులు, సర్పంచులు, ఎంపిటీసీలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 12)

సంతమాగులూరు మండలంలో విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కుమారుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ప్రారంభించారు. చవిటిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 252 మంది విద్యార్థులకు, మిన్నేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు సౌకర్యవంతంగా పాఠశాలకు చేరుకుని చదువులో మరింత ముందుకు సాగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక టిడిపి నాయకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.








# క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్




**ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ గంగాడ సుజాత**

**మై భారత్ సహకారంతో నిర్వహణ**

**పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు**

**రాష్ట్రస్థాయికి ప్రతిభ కనబరచిన విద్యార్థులు ఎంపిక**





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "50 సంవత్సరాల అత్యవసర పరిస్థితి: భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు" అనే అంశంపై విద్యార్థులు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు కళాశాలల నుంచి దాదాపు 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రస్తుతం యువత సెల్ ఫోన్లకు బానిసలుగా మారారని, దాన్ని పక్కన పెడితే



అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. అంతేకాకుండా ప్రతి విషయాన్ని ఛాలెంజ్ గా తీసుకోవాలని, ఇలాంటి కార్యక్రమాలు పాల్గొని చదువుతో పాటు సమాజం గురించి తెలుసుకోవాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వాన్ని, వేదికను ఇచ్చిన క్విస్ యాజమాన్యానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మాట్లాడిని క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు... ఇలాంటి అద్భుతమైన కార్యక్రమం నిర్వహించేందుకు క్విస్ కళాశాలను ఎంపిక చేసుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తమ కళాశాల అద్భుతమైన విద్యను అందిచడంతో పాటుగా ఇలాంటి అనేక కార్యక్రమాలను చేయడంలో ఎప్పుడూ ముందు ఉంటుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన యూత్ పార్లమెంట్ ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. యూత్ పార్లమెంట్ లో పాల్గొన్న విద్యార్థులు "50 సంవత్సరాల అత్యవసర పరిస్థితి: భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు", వికసిత భారత్ గురించి అనేక విషయాలు పంచుకున్నారు. వారిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మై భారత్ ప్రకాశం యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, స్టూడెంట్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ వాసుబాబు, ఎన్ ఎస్ ఎస్ పీవో వేణుగోపాల్, మై భారత్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఒంగోలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసం ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆవిష్కరించారని అన్నారు. ఎన్నో పోరాటాల చేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజా సంక్షేమం కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని తెలిపారు. 2029 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని బూచేపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ సమన్వయకర్త చుండూరి రవిబాబు, పిడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మన్ మదాసి వెంకయ్య, జడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షులు కటారి శంకర్, ఎంపిపి అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దారవీడులో ఘనంగా వైయస్ఆర్సీపీ ఆవిర్భావ దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 12)**

పెద్దారవీడు మండల కేంద్రంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పెద్దారవీడు బస్టాండ్ సెంటర్లో గ్రామ పార్టీ అధ్యక్షులు కాసు వెంకట్‌రెడ్డి నేతృత్వంలో జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కటింగ్ చేశారు. పలువురికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు వెంకటేశ్వరరెడ్డి (మాజీ డీలర్) మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దూదేకుల కాశయ్య, మండల యూత్ అధ్యక్షులు దుగ్గెం దినేష్, వెన్నా అల్లురిరెడ్డి, గుండారెడ్డి పోలిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, వెన్నా మహేశ్వర్‌రెడ్డి, గొట్టం కృష్ణారెడ్డి, వార్డు మెంబర్ వేశపోగు కమలహాసన్, వేశపోగు ప్రసాదరావు, దుగ్గెం భాస్కర్, మాజీ (డిలర్), అల్లు గోవిందరెడ్డి, కొండయ్య యాదవ్, ఇంజేటి వీరాచారి, అల్లు రంగారెడ్డి, అల్లు భూపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## డివిజన్‌లలో పర్యటించిన కమిషనర్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)**

ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు గురువారం 9వ డివిజన్‌లోని రాజీవ్ గృహ కల్ప 4, 5, 6 లైన్లలో నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక డివిజన్‌లోని నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసు కున్నామన్నారు. ప్రజలు సైడ్ కాలువలు, రోడ్ల కి సంబంధించిన సమస్యలు దృష్టి తీసుకొచ్చారన్నారు. అక్కడ ఇండ్లకు ప్రతిరోజూ చెత్త సేకరణకు సానిటరీ వర్కర్స్ వస్తున్నారో లేదో అని కమీషనర్ అడిగి తెలుసుకొన్నారు. తరువాత అక్కడి ప్రజలతో కలిసి 4వ లైన్‌లో ఉన్న పార్క్‌ని పరిశీలించి, వాటిలో పాడైపోయిన ఆట వస్తువులను వెంటనే మరమ్మత్తు చేయించవలసినిదిగా ఆదేశాలు ఇచ్చారు. అలానే ప్రజలకోసం పార్కులో జిమ్ ను ఏర్పాటు చేయుటకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అక్కడ కాలువల కోసం వెంటనే అంచనాలు తయారు చేయాలని సూచించారు. రాజీవ్ గృహ కల్ప 1 నుంచి 6 వ లైన్లకు కనెక్టివిటీ కోసం క్వారీ రబ్బిష్ రోడ్ కోసం అంచనాలు తయారు చేయాలన్నారు. అలానే 5వ లైన్లో పర్యటించి అక్కడ కాలువలు కోసం, క్వారీ రబ్బిష్ రోడ్ కోసం అంచనాలు తయారు చేయాలని చెప్పారు. 6వ లైన్లో పార్క్ ని పరిశీలించి అక్కడ ప్రజల కోసం పార్కులోపల గ్రీనరీ ఏర్పాటు చేయుటకు అంచనాలు తయారు చేయాలన్నారు. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులను మరమత్తులు చేపించాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ పర్యటనలో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్‌తో పాటు 9వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు ఎంఈ ఏసయ్య, ఎంహెచ్ఓ వైష్ణవి, ఎస్ఎస్ పిచ్చయ్య, ఏఈ అంజిరెడ్డి, సిఐటియు నాయకులు చీకటి శ్రీనివాసరావు, ఇతర నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.





## చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి

**సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్**





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 12)**

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా భవిష్యత్తులో చట్టపరంగా ఎటువంటి సమస్య ఎదురైనా పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని సెయింట్ జేవియర్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగడం వల్ల భవిష్యత్తులో బాలబాలికల మానసికంగా, శారీరకంగా ఎంతో ఇబ్బందులు గురికావడం జరుగుతుందన్నారు. ఈ విషయం మీద అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాల నిరోధానికి సమాజంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. మత పెద్దలు ఎవరైనా గాని, బంధువులు గాని బాల్య వివాహాల విషయంలో పాలుపంచుకుంటే తగిన శిక్షలు చట్టప్రకారం విధించడం జరుగుతుందన్నారు. అదే విధంగా విద్యార్థులు చిన్నతనం నుండే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశం మీద అవగాహన కలిగి ఉండటం వల్ల లైంగిక దోపిడీలు నిరోధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుందరమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com